మినీకథ

# లిఫ్ట్

జి. రాముడు



మధ్యాహ్నం మూడు గంటలు కావడం మూలాన రోడ్లపై ట్రాఫిక్ పల్చగా వుంది. అప్పుడప్పుడూ వాహనాలు వస్తూ పోతున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే చిక్కడపల్లి బస్టాపులోకూడ జనం అంతగా లేరు.

ఎంతకూరాని బస్సుమీద విసుక్కుంటూ వాచి చూసుకొంది మాధవి. టైమ్ మూడుం పావయింది. తను ముప్పావు గంట నుంచి వెయిట్ చేసూనే వుంది. ఒక్క బస్సు రాలేదు. దానికితోడు మధ్యాహ్నం. తను మూడున్నరకి తన గమ్యం చేరుకోవాలి. చేరుకోగలదా? నాన్నగారి స్నేహితుడు తనను మూడున్నరకు ఆఫీసులో కలుసుకోమన్నాడు. తను వెళ్లేది ఉద్యోగం కోసం. అంమనా ప్రయివేటు. ఉద్యోగం కోసం వచ్చారంటే అందరికీ అలుసే! చెప్పిన టైమ్‌కి వెళ్ళకపోతే మరీ హీనంగా మాట్లాడుతారు. "నీకు పంక్చువాలిటీ లేదు. నువ్వు ఇక్కడ ఉద్యోగం చెయ్యటానికి తగవు" అంటే?

ఒక్కసారిగా తనకుఉద్యోగం వస్తుందో రాదోనన్న భయం పట్టుకొంది మాధవికి. బస్సును తిట్టుకొంటూ నుదుటపట్టిన చెమటను కర్చీఫ్‌తో అద్దుకొంటూ నిర్మానుష్యంగా వున్న రోడ్డు వైపు చూసింది. బస్సు జాడేమీ కన్పించలేదు. తనకింక పావుగంట టైముంది. కనీసం ఆటోలోనైనా వెళదామనుకొంటే అవీ రాలేదు. వచ్చిన ఇద్దరు ముగ్గురు పిలిచినా విన్పించుకోకుండా వెళ్ళారు. తను టైమ్‌కి వెళ్ళగలదా? తనకు ఉద్యోగం వస్తుందా? ఎలా వెళ్ళాలి? విచారంగా కనుచూపు మేరవరకు ఆశగా చూడసాగింది.

*   *   *

అప్పుడే ఆఫీసరు దగ్గర పర్మిషన్ తీసుకొని స్కూటర్ స్టార్ట్‌చేసి ఇంటికి బయలుదేరాడు రఘు. మరొకసారి వెనుకజేబు తడుముకొని, ఒత్తుగా పర్సు తగలడంతో తృప్తిగా తిరిగి చేయి ఆక్సిలేటర్ మీదుంచి స్పీడు పెంచాడు.

ఆ రోజే జీతాలు రావడంతో పర్సు నిండుగా వుంది. శ్రీమతిగారు పుట్టింటికి పోతూండడం మూలాన తనను జీతం తీసుకొన్న వెంటనే షాపింగ్‌కు వెళ్ళాలి, త్వరగా రమ్మంది. సాయంత్రానికి సగం పర్సు ఖాళీ అవుతుందని తెలిసినా, సాయంకాలంతను శ్రీమతితో గడుపబోయే క్షణాలు తలుచుకొంటుంటే మనస్సంతా హుషారుగా వుంది రఘుకు.

జనసమ్మర్దం లేని రోడ్డుపైవేగంగా వెళుతున్న రఘుకు ప్రక్కన బస్స్టాపులో ఎవరో తననే చూస్తున్నటు అన్పించటంతో ప్రక్కకి తిరిగి చూశాడు. ఎవరో 20 ఏళ్ళ యువతి తననే చూస్తూన్న దనిపించటంతో "ఎవరబ్బా" అనుకొంటూ స్కూటర్ స్లో చేస్తూ పరీక్షగా చూశాడు.

"తననే!" ఒక్కసారి రఘుకు అదోలా అన్పించింది. తిరిగి ఆమె వైపే సూటిగా చూశాడు.

చేయి ఊపుతూ ఆపమన్నట్లు సంజ్ఞ చేసిందా యువతి (పాఠకులకు తెలిసిన సదరు మాధవి). ఒక్కక్షణం విసుగనిపించినా అర్థింపుగా చూస్తున్న మాధవి ముఖం చూసేసరికి రఘు మనస్సు కరిగిపోయింది.

ఆమె ప్రక్కగా స్కూటర్ ఆపుతూ ఏమిటన్నట్లు చూశాడు.

"నేను మూడున్నరకి జి.పి.ఓ. దగ్గరకు అర్జంటుగా వెళ్ళాలి. గంటనుంచి వెయిట్ చేస్తున్నాను. ఇంతవరకూ బస్సు రాలేదు. నాకు అక్కడవరకూ లిఫ్ట్ యిస్తే నాకెంతో మేలు చేసినవారవుతారు. ప్లీజ్...." ప్రాధేయపూర్వకంగా అంటున్న మాధవిని చూసేసరికి తప్పక సహాయపడాలనిపించింది రఘుకు.

ఒక్కసారిగా త్వరగా రండని పదేపదే చెప్పిన శ్రీమతి గుర్తొచ్చింది. తను ఆలస్యంగా వెళితే దండకం మొదలెడుతుంది. అయినా పది నిముషాలకంటె ఆలస్యం ఏం కాదులే అనుకొంటూ "ఎక్కండి" అన్నాడు రఘు. ఇలాంటి అవకాశం దొరికినందుకు లోలోన సంతోషపడ్తూ.

ఇంతలో ప్యాంటు వెనుక జేబులోని పర్సు గుర్తుకు రావడంతో ఎందుకైనా మంచిదనుకొని తీసి చొక్కా జేబులో వేసుకొన్నాడు.

అప్పుడే అడుగు ముందుకు వేయబోయిన మాధవి రఘు చర్యను చూసి దెబ్బ తిన్నట్లు స్థాణువులా నిలబడిపోయింది. ఇబ్బందిగా రఘు ఆమె నుంచి చూపులు మరల్చుకొన్నాడు.

"నేను మీ మనస్సు బాధించి ఉంటే క్షమించండి. కానీ డబ్బు పోతే నేనెంత బాధపడాలో నాకు తెలుసు. ఇట్లాంటి సంఘటనల్లో డబ్బు కొట్టేయడం మీకు తెలుసు. అందుకే అందంగా అమాయకంగా కన్పించే మిమ్మల్ని కూడ అనుమానించాల్సివచ్చింది! అయామ్ వెరీసారీ!" అనాలనుకొన్న రఘు పైకి అనలేక తనలోతనే గొణుక్కున్నాడు.